# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020 | - K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 113 | పేజీలు : 08 | బుధవారం | 29-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




## రిట్టైరైనా వదిలిపెట్టం

2

- మా ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు..రిట్టైరైనా వదిలిపెట్టం
- ఐపీఎస్ అధికారులకు హరీశ్ రావు వార్నింగ్
- బీఆర్ఎస్ నేతల ఫోన్లు, ఇంటి ముందు కెమెరాలను హ్యాక్ చేస్తున్నారన్న హరీశ్
- బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను రప్పించారని ఆరోపణ రాబోయేది తమ ప్రభుత్వమేనని వార్నింగ్

## లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ పర్యాటక శాఖలో కొలువులు

2



ఆదర్శ నగరాలతో పోటీపడేలా

# భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలి

2

- ప్రజాప్రతినిధులు ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుంది
- జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చర్యలు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో అక్కడి ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, కార్పొరేటర్లు ప్రభుత్వానికి సహకరిస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం జరిగితే ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల ప్రజాప్రతినిధులకు పాస్ పంపాలని పోలీసులకు సూచించారు.కొంతమంది తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారని,



2

## 'సారు బయటకు రారు'

అని కవితనే చెప్పారు: ప్రభుత్వ విప్

- కూతురు కవిత విమర్శకు కేసీఆర్ సమాధానం చెప్పాలని నిలదీత
- ఏ రైతునూ కలవని కేసీఆర్ వారు ఇబ్బందుల్లో ఉన్నట్లు చెప్పడమేమిటని ప్రశ్న
- బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందో వారు సమీక్షించుకోవడం లేదన్న ఆది శ్రీనివాస్



2

## నేడే తెలంగాణ టెన్త్ ఫలితాలు..

ఈసారి వాట్సాప్‌లోనూ రిజల్ట్స్!

- నేడే మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పదో తరగతి ఫలితాలు
- దాదాపు 5.15 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం వెల్లడి
- ఈ ఏడాది కొత్తగా వాట్సాప్‌లోనూ ఫలితాలు తెలుసుకునే సౌకర్యం
- నిర్ణీత నంబర్‌కు 'హాయ్' అని పంపి రిజల్ట్స్ సులభంగా పొందొచ్చు

## దయచేసి వ్యక్తిగతంగా చొరవ తీసుకోండి

రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ

- చర్లపల్లి రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మౌలిక సదుపాయాలపై లేఖ
- గతంలోను ముఖ్యమంత్రికి లేఖ రాశానన్న కిషన్ రెడ్డి
- అయినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్న కేంద్రమంత్రి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మౌలిక సదుపాయాలకు సంబంధించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ పనుల నిమిత్తం గతంలో పలుమార్లు లేఖలు రాసినా అధికారుల నుంచి క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. "దయచేసి ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఆయా రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి" అని విజ్ఞప్తి చేశారు.హైదరాబాద్ నగరంలో రోజురోజుకు



2

## ఇరాన్ పతనం అంచున ఉంది..

వాళ్లే మాకు చెప్పారు: ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్య

- హర్మూజ్ దిగ్బంధనాన్ని ముగించాలని ఇరాన్ కోరిందన్న ట్రంప్
- ఇరాన్ తమ నాయకత్వాన్ని చక్కదిద్దుకునే పనిలో ఉందని వ్యాఖ్య
- అంతర్గత విభేదాలను వారు పరిష్కరించుకోవాలని సూచన

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఇరాన్ పతనం అంచున ఉందని, ఈ విషయాన్ని స్వయంగా ఆ దేశ ప్రతినిధులే తమకు చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. వీలైనంత త్వరగా హర్మూజ్ జలసంధిని కూడా తెరవాలని వారు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. హర్మూజ్ దిగ్బంధనాన్ని ముగించాలని వారు



## పార్లమెంట్‌లో ఏం జరుగుతుందో కేసీఆర్‌కు తెలియడం లేదు: ఎంపీ మల్లు రవి

2




## డీజీపీగా సీవీ ఆనంద్ నియామకం

ఉత్తర్వులు జారీ

- డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న శివధర్‌రెడ్డి
- 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్?ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి బదిలీ అయ్యారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో సేవలు అందించారు.ఇటీవలే యూపీఎస్సీ డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను తెలంగాణ ప్రభుత్వానికి పంపించిన సంగతి తెలిసిందే. అందులో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా ప్రభుత్వం నియమించింది.



2

## వినాశకాలే విపరీత బుద్ధి అని పెద్దలు ఊరికే అనలేదు

- పెట్రోల్ బంక్‌లో యువకుల బైక్ స్టంట్‌పై సీపీ సజ్జనార్ ఆగ్రహం
- అమ్మాయిలను ఇంప్రెస్ చేసేందుకు చేసిన విన్యాసం వికటించిన వీడియో వైరల్
- 'వీలింగ్స్' తల్లిదండ్రులకు కన్నీటి 'ఫీలింగ్స్' మిగల్చొద్దంటూ హితవు
- ప్రమాదకర ప్రదేశాల్లో స్టంట్లు మూర్ఖత్వమని హెచ్చరిక
- బాధ్యతగా మెలగాలని యువతకు సజ్జనార్ సూచన

## జోరందుకున్న ధాన్యం కొనుగోళ్లు

- 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం
- 6 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ఇప్పటికే 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతుల ఖాతాల్లోకి రూ.276.38 కోట్లు విడుదల



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రంలో 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి కానుంది. ఇందులో 90 లక్షల మెట్రిక్

## పైలట్ రోహిత్ రెడ్డికి బెయిల్

నేడు చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

సంచలనం సృష్టించిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి ఊరట లభించింది. దాదాపు ఒకటిన్నర నెలలుగా జైలులో ఉన్న ఆయనకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.కేసు వివరాల్లోకి వెళితే... గత మార్చి 14వ

## సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు

2

- కూతురు అడిగే ప్రశ్నలకు కేసీఆర్ సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు: మహేశ్ కుమార్ గౌడ్
- కేసీఆర్ కుటుంబం సొంత వివాదాలతో సతమతమవుతోందన్న టీపీసీసీ చీఫ్
- కేసీఆర్ కుటుంబం పదవుల కోసం పాకులాడుతోందని విమర్శ
- ప్రజలు బీఆర్ఎస్‌ను విశ్వసించడం లేదన్న మహేశ్ కుమార్ గౌడ్



# రిటైరైనా వదిలిపెట్టం

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ అగ్ర నాయకులతో పాటు ఎమ్మెల్యేల ఫోన్లను, వారి ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను ప్రైవేట్ హ్యాకర్ల ద్వారా కొందరు ఐపీఎస్ అధికారులు హ్యాక్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కొందరు ఐపీఎస్ అధికారులు బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను రప్పించి తమ వ్యక్తిగత సంభాషణలు, సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్నారని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు రిటైర్ అయినా వదిలిపెట్టమని, రాబోయేది తమ ప్రభుత్వమేనని హెచ్చరించారు. బాధ్యులైన వారు సొంత ఖర్చులతో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌తో పాటు ఇతర నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ వేధిస్తోందని ధ్వజమెత్తారు. బెయిల్ వచ్చే సమయంలో పీటీ వారెంట్లు తెచ్చి మరీ జైల్లో ఉంచుతున్నారని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ మోసం చేసిందని, ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగ్గొట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

# ‘సారు బయటకు రారు’

మొదటి పేజీ తరువాయి

“సారు బయటకు రారు, ఎవరినీ కలవరు” అని స్వయంగా కేసీఆర్ కూతురు, తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తన తండ్రిపై విమర్శలు చేశారని, ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిలదీశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఏ రైతునూ కలవని కేసీఆర్, వారు ఇబ్బందుల్లో ఉన్నట్లు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో తరుగు పేరుతో రైతులను దోపిడీ చేశారని ఆరోపించారు. తెలంగాణలోని రైతులను పట్టించుకోని కేసీఆర్, ఇతర రాష్ట్రాలకు వెళ్లి చెక్కులు ఇచ్చారని కవిత చెప్పారని, ఆమె వ్యాఖ్యలకు సమాధానం చెప్పని కేసీఆర్, కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడమేమిటని అన్నారు. రైతుల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం సంవత్సరానికి రూ. 2,800 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అన్నారు. వరిసాగులో తెలంగాణ ఇప్పుడు పంజాబ్‌ను అధిగమించిందని, ఈ సీజన్‌లో కూడా 8 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధాన్యానికి బోనస్ రూ. 3 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేసినట్లు చెప్పారు. వరికి బోనస్ ఇవ్వాలనే ఆలోచన కేసీఆర్‌కు ఎప్పుడైనా వచ్చిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఒక్క రైతుబంధును అమలు చేసి అన్ని పథకాలను నిలిపివేశారని మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందో ఆలోచించడం లేదని విమర్శించారు. ఆ పార్టీ నేతల అహంకార ధోరణిని ప్రజలు తప్పుపడుతున్నారని వ్యాఖ్యానించారు.

# సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు

మొదటి పేజీ తరువాయి

పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్, నేడు తన కూతురు కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కేసీఆర్ కుటుంబం సొంత వివాదాలతో సతమతమవుతోందని, వారు ప్రజల సమస్యలపై కాకుండా కేవలం పదవుల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు పదేళ్ల పాటు బీఆర్ఎస్‌ను ఆదరించారని, కానీ ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదని ఆయన అన్నారు. ఇప్పుడు ప్రజలు బీఆర్ఎస్‌ను విశ్వసించడం లేదని అన్నారు. బీఆర్ఎస్‌కు ఇక భవిష్యత్తు లేదని జోస్యం చెప్పారు. రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, ఈ క్రెడిట్ అంతా సోనియా గాంధీకే దక్కుతుందని అన్నారు. తెలంగాణ కోసం సోనియా గాంధీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే, కేసీఆర్ తన పాలనతో రాష్ట్రాన్ని 50 ఏళ్లు వెనక్కి నెట్టారని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో రాజ్యాంగ విలువల రక్షణకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# పైలట్ రోహిత్ రెడ్డికి బెయిల్

మొదటి పేజీ తరువాయి

తేదీ రాత్రి మొయినాబాద్‌లోని ఫాంహౌస్‌పై పోలీసులు జరిపిన దాడుల్లో కొకైన్, విదేశీ మద్యం, ఇతర నిషేధిత వస్తువులు లభ్యమయ్యాయి. ఈ క్రమంలో రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేశ్ రెడ్డి, వ్యాపారవేత్త నమిత్ శర్మలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ రాత్రి పార్టీలో పాల్గొన్న 11 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో ఆరుగురికి డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్‌గా తేలింది. ఈ కేసులో రోహిత్ రెడ్డి తరఫు న్యాయవాదులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, బెయిల్ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. బెయిల్ ప్రక్రియ పూర్తి కావడంతో, నేడు చంచల్‌గూడ జైలు నుంచి ఆయన విడుదలయ్యే అవకాశం ఉంది.

# దయచేసి వ్యక్తిగతంగా చొరవ తీసుకోండి

మొదటి పేజీ తరువాయి

పెరుగుతున్న జనాభా, ప్రయాణికుల రాకపోకల మూలంగా నగరంలోని మూడు ప్రధాన రైల్వే స్టేషన్లు సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ టెర్మినళ్లపై అధిక భారం పడుతోందని గుర్తు చేశారు. ఈ సమస్యకు పరిష్కారంగానే చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద రూ. 430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త టెర్మినల్‌ను కేంద్రం అభివృద్ధి చేసిందని అన్నారు. గత సంవత్సరం ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ టెర్మినల్ నుంచి పదుల సంఖ్యలో రైళ్లు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. రోజురోజుకు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నందున రైల్వే స్టేషన్‌కు వెలుపల అప్రోచ్ రోడ్లను విస్తరించాల్సి ఉందని అన్నారు. స్టేషన్‌కు ఇరువైపులా పార్కింగ్ తదితర అవసరాల కోసం కూడా భూసేకరణ చేయాల్సి ఉందని తెలిపారు. చర్లపల్లి స్టేషన్ నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్‌కు 200 అడుగుల వెడల్పుతో, భరత్ నగర్, ఈసీ నగర్‌ల వైపు 100 అడుగుల చొప్పున వెడల్పుతో రోడ్లను విస్తరించాలని కోరారు. చర్లపల్లి టెర్మినల్‌కు నీటి సరఫరా కనెక్షన్‌ను ఏర్పాటు చేయడానికి రైల్వే శాఖ రూ. 4 కోట్లు జమ చేసిందని, ఈ నీటి కనెక్షన్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్తు రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్ వద్ద ఆల్ఫా హోటల్ నుంచి రేతిఫైల్ బస్ స్టేషన్ వరకు ఉన్న రహదారిని 120 అడుగుల వెడల్పుతో విస్తరించాల్సి ఉందని అన్నారు. ఈ అభివృద్ధి పనుల కోసం రైల్వే శాఖ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నివేదించామని అన్నారు. ఈ పెండింగ్ పనులకు సంబంధించి 2022, 2023 సంవత్సరాలలో నాటి ముఖ్యమంత్రికి రెండుసార్లు లేఖలు రాశానని గుర్తు చేశారు. 2024లో మీకు కూడా లేఖ రాశానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అయినా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదని అన్నారు. తాను ఉత్తరం రాసిన తర్వాత మీరు పనులు ప్రారంభించాలని ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ పనులను పూర్తి చేయాలని తన లేఖలో కిషన్ రెడ్డి కోరారు.

# నేడే తెలంగాణ టెన్త్ ఫలితాలు..

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభవార్త. రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు నేడే (బుధవారం) విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు విద్యాశాఖ అధికారులు ఈ ఫలితాలను అధికారికంగా వెల్లడించనున్నారు. ఫలితాల విడుదలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్ 23వ తేదీ నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. వాస్తవానికి మే మొదటి వారంలో ఫలితాలు ప్రకటించాలని తొలుత భావించినప్పటికీ, ఆ గడువు కంటే ముందే ఫలితాలను విడుదల చేస్తుండటం గమనార్హం.

**వాట్సాప్‌లో సులభంగా ఫలితాలు**

ఈ విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ ఎస్సెస్సీ బోర్డు ఒక వినూత్న సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ఫలితాలను సులభంగా వాట్సాప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటికే హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించిన బోర్డు, ఇప్పుడు అదే తరహాలో ఫలితాలను అందించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే వాట్సాప్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థుల మొబైల్ నంబర్‌కు ఫలితాల మెమో ఆటోమేటిక్‌గా వస్తుంది. ఒకవేళ ఆ సదుపాయం వినియోగించుకోని వారు, తమ ఫలితాలను తెలుసుకోవాలంటే.. 80969 58096 అనే వాట్సాప్ నంబర్‌కు ‘HI’ అని సందేశం పంపించాలి. ఆ తర్వాత ‘SSC RESULT’ అని టైప్ చేసి, హాల్‌టికెట్ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తే, ఫలితం వారి ఫోన్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. ఈ కొత్త విధానం ద్వారా విద్యార్థులు సర్వర్ల రద్దీ సమస్య లేకుండా తమ ఫలితాలను వేగంగా తెలుసుకునేందుకు వీలు కలుగుతుంది.

# ఇరాన్ పతనం అంచున ఉంది..

మొదటి పేజీ తరువాయి

తమను కోరారని ‘ట్రూత్’ సోషల్ మీడియా వేదికగా ఆయన పోస్టు పెట్టారు. ఇరాన్ తమ నాయకత్వాన్ని చక్కదిద్దుకునే పనిలో ఉందని ఆసక్తికర వ్యాఖ్య చేశారు. సుదీర్ఘ యుద్ధం కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తమ దేశ ప్రతినిధులతో చర్చల విషయంలో ఇరాన్ ప్రభుత్వంలో ఉన్న అంతర్గత విభేదాలను వాళ్లు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. అయితే ఇరాన్ నుంచి ఎవరి ద్వారా తనకు ఈ సమాచారం అందిందనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. అలాగే ఈ సంభాషణ నేరుగా జరిగిందా లేక మధ్యవర్తి ద్వారా తెలిసిందా? రిపబ్లికన్ ప్రభుత్వంలో ఎవరికి ఈ సమాచారం అందింది? అనే ప్రశ్నలపై కూడా వైట్ హౌస్ స్పందించలేదు.

# లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ పర్యాటక శాఖలో కొలువులు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, ఏప్రిల్ 28: లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ముగింపు దశకు చేరుకున్నాయి. పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో వారికి ఉద్యోగాలు కల్పించింది. వారంతా భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించనున్నారు. అందుకోసం వారికి.. నెల రోజులపాటు తెలంగాణ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా శిక్షణ అందించాయి. ఈ శిక్షణ పూర్తి కావడంతో.. వారిని పర్యాటక శాఖలో కొలువుల్లోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. అందుకోసం‘ఆపరేషన్ కగార్’ను తెరపైకి తీసుకు వచ్చింది. లొంగిపోయిన మావోయిస్టులకు నగదుతోపాటు పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం.. లొంగిపోయిన వారికి గిరి దర్శక్ గైడ్లుగా పర్యాటక శాఖలో ఉద్యోగాలు కల్పించింది.

# వినాశకాలే విపరీత బుద్ధి అని పెద్దలు ఊరికే అనలేదు

మొదటి పేజీ తరువాయి

యువత రోడ్లపై చేసే ప్రమాదకర బైక్ విన్యాసాలపై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మరోసారి తీవ్రంగా స్పందించారు. పెట్రోల్ బంక్ లాంటి అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంలో కొందరు యువకులు చేసిన బైక్ స్టంట్‌కు సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేస్తూ, యువతకు ఆయన గట్టిగా హితవు పలికారు. వివరాల్లోకి వెళితే, ఓ పెట్రోల్ బంకు వద్ద అమ్మాయిలను చూసి ఇద్దరు యువకులు బైక్‌పై వీలింగ్ చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆ స్టంట్ వికటించి మరో బైక్ ను ఢీకొట్టారు. దీంతో అక్కడున్న వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, ఓ వ్యక్తి ఆ యువకుడిపై చేయి కూడా చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ వీడియోను పంచుకుంటూ సజ్జనార్ తనదైన శైలిలో స్పందించారు. “వినాశకాలే విపరీత బుద్ధి అని పెద్దలు ఊరికే అనలేదు. పెట్రోల్ బంక్ లాంటి అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంలో అమ్మాయిలను ఇంప్రెస్ చేయడానికి బైక్ స్టంట్లు చేయడం సాహసం కాదు.. అది పచ్చి మూర్ఖత్వం! మీ ఒక్క క్షణపు షో కోసం అక్కడ ఉన్న అమాయకుల ప్రాణాలు బలి కావాలా!? గుర్తుంచుకోండి.. మీరు చేసే వీలింగ్స్ ఇంట్లో మీ కోసం ఎదురుచూసే తల్లిదండ్రుల కళ్లలో కన్నీటి ఫీలింగ్స్ మిగల్చకూడదు. బాధ్యతగా ఉండండి” అని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. క్షణికావేశంలో చేసే పనులతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని యువతకు సూచించారు.

# జోరందుకున్న ధాన్యం కొనుగోళ్లు

మొదటి పేజీ తరువాయి

టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది. ఇందులో భాగంగా గతంలో కన్నా కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచారు. ఏప్రిల్ 27 నాటికి ప్రతిపాదించిన 8,525 కొనుగోలు కేంద్రాల్లో 6,002 కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,537 కేంద్రాలు, ప్యాక్స్ ద్వారా 3,121 కేంద్రాలు, ఇతర సంస్థల ద్వారా 344 కేంద్రాలు ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు 13.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేరింది. ఇందులో దొడ్డు రకం 8.85 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. సన్న రకం 4.44 లక్షల మెట్రిక్ టన్నులు ఉంది. కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యంలో 58 శాతం , 7.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం పూర్తయింది. ఇంకా 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు 7.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. ధాన్యం అమ్ముకున్న రైతులకు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయి. మొత్తం రూ. 2,030.31 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికే రూ. 276.38 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. ఎంఎస్పీ కింద రూ. 1,562.73 కోట్లు, సన్న వడ్ల బోనస్ కింద రూ. 191.19 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ నిధులను త్వరలోనే విడుదల కానున్నాయి.

# భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలి

మొదటి పేజీ తరువాయి

ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి కలెక్టర్, మంత్రికి పంపాలని తెలిపారు. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతామని, ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాలుగో నగరంగా ఫ్యూచర్‌సిటీని తీర్చిదిద్దాలనుకుంటున్నామని, ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడుల ఒప్పందాలు ఇక్కడే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ సమిట్ ద్వారా ప్రపంచానికి విశ్వాసం కలిగిందన్న సీఎం సైబరాబాద్, హైటెక్ సిటీ, ఓఆర్ఆర్, విమానాశ్రయ నిర్మాణం మన కళ్ల ముందే అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. అభివృద్ధి ప్రాంతాలుగా తీర్చిదిద్దిన ఆనాటి నాయకులను కొంతమంది అవహేళన చేశారని అన్నారు. దేశంలో ఏ నగరానికి లేనివిధంగా 160 కిలో మీటర్ల మేర ఓఆర్ఆర్ నిర్మించారని సీఎం గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీకి భూములిచ్చే రైతులను ఆదుకునే బాధ్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. చట్టపరంగా నోటిఫికేషన్లు, న్యాయపరమైన ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయ్యిందన్న ఆయన భూమి ఇవాళ కాకపోతే రేపు అయినా ప్రభుత్వానికి బదిలీ అవుతుందని తెలిపారు. భూమి బదిలీ ఆగే అవకాశం లేదని, తాత్కాలికంగా వాయిదా పడవచ్చని చెప్పారు. ప్రభుత్వం తరఫున ప్రక్రియ జరిగినపుడే పరిహారం డబ్బులు తీసుకుంటే మరోచోట తక్కువ ధరకు భూములు వచ్చేవని రైతులనుద్దేశించి సీఎం అన్నారు. ఆలస్యమైతే ఎకరాల్లో భూసేకరణ జరిగితే పరిహారం డబ్బులతో గజాల్లో కూడా వేరే చోట భూమి రాదని పేర్కొన్నారు. బాధితుల పిల్లలకు స్కిల్స్ వర్సిటీలో నైపుణ్య శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకుంటామని, ప్రజాప్రతినిధులు బాధితులతో మాట్లాడి అభద్రతా భావాన్ని తొలగించాలన్నారు. అభివృద్ధికి భూములిచ్చిన రైతులను గౌరవించాలని, స్థానికులు సహకరిస్తే ప్రపంచంలోనే అద్భుత నగరానికి పునాదులు వేగంగా పడతాయని పునరుద్ఘాటించారు.

# పార్లమెంట్‌లో ఏం జరుగుతుందో కేసీఆర్‌కు తెలియడం లేదు: ఎంపీ మల్లు రవి

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి మరోసారి మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ఫాం హౌస్‌లో ఉండే కేసీఆర్‌కు పార్లమెంట్‌లో ఏం జరుగుతుందో తెలియనట్లు ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ కేసీఆర్‌కు ఆయన హితవు పలికారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలని తాము వెంటనే పార్లమెంట్‌లో డిమాండ్ చేశామని ఈ సందర్భంగా మల్లు రవి గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలపై కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన సూచించారు.

# ఐకెపి కేంద్రంను సందర్శించిన తహసిల్దార్ ప్రదీప్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలో నెమిల గ్రామంలో ఐకెపి కేంద్రాన్ని తహసిల్దార్ ప్రదీప్ మంగళవారం సందర్శించారు. మహిళా సమాఖ్య నేతలను, హమాలీలను, సర్పంచ్ పులి రాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి తూకాలు వేయించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా కొనుగోళ్ళు జరుగుతున్నాయని నిర్ధారించినట్లు రైతులు తెలిపారు.

# పేదింటి ఆడ బిడ్డ వివాహానికి బీర్ల ఫౌండేషన్ సాయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన చింతల ఎల్లమ్మ రాజుల కూతురు వివాహానికి బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్ మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలో మంజూరి అయిన 30 కళ్యాణ చెక్కులను మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య లబ్ధిదారులకు అందజేశారు. యాదగిరిగుట్టలో ఆయన ప్రత్యేక కార్యక్రమంలో చెక్కుల పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వల్లపు ప్రదీప్, రాజపేట మండలం ప్రజా ప్రతినిధులు నాయకులు సర్పంచులు పాల్గొన్నారు

# విదేశీయులు తమ దేశాలకు వెళ్లే వరకు భద్రతతో చూసుకోవాలి : ఎస్పీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా జోగిపేట సబ్ జైలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ హోం (విదేశీయుల కేంద్రం)ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. విదేశీయులు తమ దేశాలకు తిరిగి వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రతతో ఉంచాలని ట్రాన్సిట్ హోం అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాస్‌పోర్ట్ గడువు ముగియడం మరియు ఇతర చట్టపరమైన కారణాలతో ట్రాన్సిట్ హోంలో ఉంచబడిన విదేశీయులను సంబంధిత ప్రక్రియ పూర్తయ్యే వరకు సురక్షితంగా సంరక్షిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ట్రాన్సిట్ హోంలో 12 మంది విదేశీయులు ఉన్నారని, వారి భద్రత దృష్ట్యా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. విదేశీయులకు తగిన వసతి, ఆహారం, త్రాగునీరు, వైద్యసేవలు వంటి అవసరమైన సదుపాయాలు కల్పించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే ట్రాన్సిట్ హోంలో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తూ నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ పాండు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి కొరత లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, నారాయణఖేడ్ :**
వేసవి కాలంలో తాగునీటి కొరత ఏర్పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి నివాస ప్రాంతానికి నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, పారిశుధ్యం, సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై లోతుగా చర్చించారు.మండలాల వారీగా గ్రామాల్లో నీటి సరఫరా పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, మరమ్మతులు అవసరమైన పనులపై కలెక్టర్ ఆరా తీశారు. గత వేసవిలో సమస్యలు తలెత్తిన ప్రాంతాలను గుర్తించి, ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి వృథాను అరికట్టి, సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చూడాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలని, గ్రామ పంచాయతీ పరిధిని స్పష్టంగా తెలిపేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలం రేణికుంట గ్రామ రెవెన్యూ పరిధిలోని శ్రీగిరి సంకల్పసిద్ధి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని పలువురు కాంగ్రెస్ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మొదటగా క్షేత్రపాలక శ్రీ వరాహ స్వామి వారి దర్శనం చేసుకుని అనంతరం ప్రధాన ఆలయంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు



గోత్రనామార్చనలతో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పెద్దలను ఆలయ అర్చకులు సాంప్రదాయంగా శేష వస్త్రాలు, పూలమాలలతో సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు. రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, తెలంగాణ రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, కొత్తజాల మాజీ ఉప సర్పంచ్ పాశీదరి తదితరులు దర్శించుకున్నారు

# అగ్ని ప్రమాద నివారణపై అవగాహన సదస్సు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్నందున హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ భీమయ్య హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు హోటళ్లలో అగ్నిమాపక శాఖ అవగాహన సదస్సు నిర్వహించింది. వంటగదుల్లో గ్యాస్ లీకేజీ లేకుండా చూసుకోవాలని, విద్యుత్ వైరింగ్ క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచుకోవాలని, వాటి వాడకంపై సిబ్బందికి అవగాహన ఉండాలని తెలిపారు. అత్యవసర నిర్గమన ద్వారాలు ఎల్లప్పుడూ ఖాళీగా ఉంచాలని స్పష్టం చేశారు.నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మధుకర్, ఇమ్రాన్, స్థానిక హోటల్ నిర్వాహకులు పాల్గొన్నారు

# సేంద్రియ వ్యవసాయ క్షేత్రంను సందర్శించిన జిల్లా వ్యవసాయ అధికారి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట గ్రామానికి చెందిన రైతు స్వరన్ పాల్ సింగ్ సేంద్రియ వ్యవసాయ (క్షేత్రం) పొలాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి పి.వెంకటరమణా రెడ్డి, రైతు పండిస్తున్నటువంటి సమగ్ర సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతు ద్వారా అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రాబోయే రోజులలో అందరూ రైతులు ఈ విధానాన్ని అవలంబించాలని రైతు చేస్తున్నటువంటి పనిని సంతృప్తి వ్యక్తం చేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల వ్యవసాయ అధికారిని, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మే డే వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## ఎస్.కె. సాబీర్ పాషా జిల్లా కార్యదర్శి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
ఎనిమిది గంటల పనిదినం కోసం చికాగో వీధుల్లో కార్మికులు చిందించిన రక్తతర్పణం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్రామికులకు స్ఫూర్తిదాయకం. ఈ మే డేను జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా సమితి నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల పట్టణ కార్యదర్శులు జిల్లా సమితి సభ్యులు ఈ క్రింది కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించడమైనది:నిర్వహించాల్సిన కార్యక్రమాలు జెండావిష్కరణలు అన్ని మండల, పట్టణ కేంద్రాలు, కార్మిక క్షేత్రాలు, కార్మికవాడలు,బస్తీలు గ్రామాల్లో ఎర్రజెండాను ఎగురవేయాలి.మే డే ర్యాలీలు: కార్మిక వర్గ ఐక్యతను చాటేలా భారీ ఎత్తున ప్రదర్శనలు (ర్యాలీలు)నిర్వహించాలి. సదస్సులు: ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కార్మిక చట్టాల సవరణలు, అసంఘటితరంగ కార్మికుల సమస్యలపై మేధావులతో సదస్సులు ఏర్పాటు చేయాలివ్యాప్తి ప్రతి గడపకూ మే డే సందేశాన్ని తీసుకెళ్లాలి. ముఖ్యంగా పరిశ్రమలు,ఫ్యాక్టరీలు వ్యవసాయ క్షేత్రాల్లో కార్మికులను భాగస్వామ్యం చేయాలి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలనుఎండగడుతూ ఎర్రజెండా నీడన శ్రామిక లోకాన్ని ఏకం చేయడం మనందరి కర్తవ్యం.కావున, పార్టీ శ్రేణులందరూ చురుగ్గా పాల్గొని,ఈ మే డే ఉత్సవాలనువిజయవంతం చేయాలని కోరుతు విప్లవ వందనాలతో,ఎస్.కె. సాబీర్ పాషా జిల్లా కార్యదర్శి, సిపిఐ జిల్లా సమితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు తెలియజేసినారు.


# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

## రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వ్యవసాయాధారిత ప్రాంతమైన మన జిల్లాలో మొక్కజొన్న సాగు చేసిన రైతులు నష్టపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించిందని తెలిపారు. గిట్టుబాటు ధర కల్పించడంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం ఉండకూడదని ఆయన హెచ్చరించారు. తూకంలో తేడాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రజెండా పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడి పోరాడుతుందని, ప్రభుత్వం నుండి రైతులకు రావాల్సిన ప్రతి పైసాను ఇప్పించే బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మంద కృష్ణ మాదిగని కలిసిన యాదాద్రి జిల్లా ఎమ్మార్పియస్, ఎంఎస్పీ నాయకులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్ నుండి వరంగల్ వెళ్తున్న ఎమ్మార్పియస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం లోని భువనగిరి పట్టణంలోని వివేరా హోటల్ వద్ద అత్యంత ప్రాధాన్యత గల అంశంపై కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎమ్మార్పియస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ తదితరులు ఉన్నారు.

# సామాన్యుడికి షాక్.. భారీగా పెరిగిన కోడిగుడ్డు ధరలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, సెంట్రల్ డెస్క్:** ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలన్ని సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో ఏం కొనెట్టు లేదు ఏం తినేట్టు లేదు అనేలా పేదల పరిస్థితి తయారవుతున్న తరుణంలో కోడి గుడ్డు ధరలు సైతం ఆకాశానంటుతున్నాయి. గత వారం రోజుల నుంచి క్రమంగా పెరుగుతున్న కోడిగుడ్డు ధర తాజాగా భారీగా పెరిగింది. గత పదిరోజుల్లోనే ఒక్కో కోడిగుడ్డు ధర రూ. 3 మేర పెరిగి సామాన్యుడి జేబుకు చిల్లు పడేలా చేస్తోంది. రెండు వారాల క్రితం ఒక్కో కోడిగుడ్డు ధర రూ. 4 ఉండగా ఇప్పుడు రిటైల్ మార్కెట్?లో ఒక్కోగుడ్డు ధర రూ.7 కు చేరింది. ఇక హోల్ సేల్ దుకాణాల్లో ఒక్కో కోడిగుడ్డు ధర రూ.6.30 గా పలుకుతోంది.

**తగ్గినట్టే తగ్గి మళ్లీ పైపైకి:**

నిజానికి అమెరికా- ఇరాన్ యుద్ధం కారణంగా కారణంగా ఎగుమతులు దెబ్బతిన్నాయి. ఈ ప్రభావంతో మార్చిలో గుడ్ల ధరలు తగ్గాయి. అయితే ఈ తగ్గింపు స్వల్పకాలికంగానే ఉంది. తాజాగా ఉష్ణోగ్రతల పెరిగి కోళ్లు మరణిస్తున్నాయని దీంతో గుడ్ల ఉత్పత్తి తగ్గిందని తద్వారా కోడిగుడ్ల ధరలు పెరుగుతున్నాయని పౌల్ట్రీ నిర్వాహకులు చెబుతున్నారు. ఇక గుడ్ల పరిస్థితి ఇలా ఉంటే చికెన్ పరిస్థితి మరోలా ఉంది. గత నెలలో కిలో ఏకంగా రూ. 400 వరకు చేరి రికార్డు సృష్టించిన చికెన్ ధరలు ప్రస్తుతం అమాంతం దిగి వచ్చాయి. ప్రస్తుతం హైదరాబాద్ లో చికెన్ లైవ్ బర్డ్ (ఫామ్ రేట్): రూ. 110, లైవ్ బర్డ్ (రిటైల్ రేట్): రూ. 137, డ్రెస్సెడ్ చికెన్: రూ. 199, స్కిన్‌లెస్: రూ. 226 వరకు ఉంది.

# మానూర్ మండలం అతిమ్యాల్ గ్రామంలో గోర విషాదం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, నారాయణఖేడ్ :** సంగారెడ్డి జిల్లా మానూర్ మండలం అతిమ్యాల్ గ్రామానికి చెందిన కోటరి గొర్ల లక్ష్మయ్య గత సంవత్సరం ఒక బర్రెను కొనుగోలు చేసి తన జీవనోపాధిగా కొనసాగిస్తున్నారు. అయితే గత రెండు రోజులుగా ఆ బర్రె నెమరా వేయకపోవడంతో ఆందోళన చెందిన లక్ష్మయ్య వెంటనే వెటర్నరీ డాక్టర్‌ను సంప్రదించారు. డాక్టర్ చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి చివరకు ఆ బర్రె మరణించడం జరిగింది. ఈ ఘటనతో లక్ష్మయ్య తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూసి, కుటుంబం దుఃఖంలో మునిగిపోయింది. ప్రభుత్వం స్పందించి ఇలాంటి పశువుల నష్టం జరిగిన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం...

## మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, సిద్దిపేట జిల్లా:** రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండగా, వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు సేకరిస్తామని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్ స్పష్టం చేశారు. మంగళవారం వర్గల్ మండల కేంద్రంలో సర్పంచ్ జయభారతి, పిఎసిఎస్ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ జితేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డితో కలసి ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే వరి ధాన్యాన్ని నిబంధనలతోపాటు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. ముఖ్యంగా ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నందున అన్నదాతలు తగు జాగ్రత్త తీసుకోవాలని కోరారు. అవసరమైన ప్రతిచోట ప్రభుత్వం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండగా, వాటిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే సన్నధాన్యానికి ప్రభుత్వం రూ 500 బోనస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మధ్య దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందాలని వివరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నాగరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబర్లు, నేతలు పొన్నాల నర్సారెడ్డి, అరవింద్ రెడ్డి, పాషా, పరశురాం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు ఇవ్వాలి

## కల్లూరి మల్లేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మంగళవారం రోజున సిపిఎం ఆలేరు మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం మాట్లాడుతూ మండలంలో సిపిఎం పోరుబాట సందర్భంగా గ్రామాలు, పట్టణంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రజా సమస్యలను అధ్యయనం చేయడం జరిగిందని ప్రజలకు సంబంధించిన వ్యక్తిగత సమస్యలు అదేవిధంగా మౌలిక సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలపై అధ్యయనం చేయడం జరిగిందని ఈ సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నేడు తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. మండలంలో అనేకమంది పేదలు ఇండ్లు లేక అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారని అదేవిధంగా చాలీచాలని ఇంటిలో సమస్యలతో జీవనం సాగిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికలకు ముందు అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని వాటిని నెరవేర్చడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని వెంటనే అర్హులైన పేదలందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా పెన్షన్లు లేకపోవడం వలన వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, బీడీ కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారని వెంటనే అర్హత కలిగిన పేదలందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండలంలో అనేక గ్రామాలు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అనేక చోట్ల గుంతల మయమైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్నారని అదేవిధంగా మండలంలో ఆలేరు మున్సిపాలిటీ నుండి శర్బనాపురం, మంతపురీ లాంటి గ్రామాలకు వెళ్లాలంటే ఈదుల వాగు పై లో లెవెల్ బ్రిడ్జిలు ఉండడం వలన వర్షాకాలంలో ఇతర గ్రామాలతో రోడ్డు మార్గం తెగిపోతుందని వెంటనే ఈదుల వాగు, పితిరి వాగులపై హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆలేరు పట్టణ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న ఆలేరు పెద్దవాగు పై బ్రిడ్జిని వేల్పు చేయాలని ఈ బ్రిడ్జి ప్రమాదకరంగా ఉండడం వలన వివిధ గ్రామాల నుండి ఆలేరు పట్టణ వచ్చే ప్రజలకు ప్రాణ సంకటనగా ఉందని ఆలేరు పట్టణం నుండి ప్రభుత్వ ఆసుపత్రికి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లాలంటే ఈ బ్రిడ్జి దాటడం ప్రాణ సంకటంగా మారిందని ఇక్కడ ప్రమాదాలు జరిగి అనేకమంది ప్రాణాలు కోల్పోయారని చాలామంది వికలాంగుల మారినారని అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. వెంటనే ఆలేరు పెద్దవాగుపై బ్రిడ్జిని వెడల్పు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆలేరులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి హోదాను పెంచి వంద పడకలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని ఇక్కడి ప్రాంత ప్రజలకు సరిపోయే విధంగా ఈ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు



అందించలేకపోతుందని దాని స్థాయిని పెంచడం వలన ఈ ప్రాంతంలో ఉండే ప్రజల వైద్య అవసరాలు తీసే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక తహసిల్దార్ కి మెమోరాండం ఇచ్చారు. భవిష్యత్తులో ప్రజల సమస్యలు పరిష్కారం కాకుంటే ప్రజలందరినీ సమీకరించి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్, సిపిఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్, లావుడియా రాజు, సూదగాని సత్య రాజయ్య, జూకంటి పౌలు, మోరీగాడి రమేష్, సంగి రాజు, పిక్క గణేష్, మిట్ట శంకరయ్య, వడ్డేమాన్ బాలరాజు, బొమ్మకంటి లక్ష్మీనారాయణ, కారే రాజు, కోలా సదానందం,మధ్యబోయిన ఉప్పలయ్య, సాయిని కళ్యాణ్, ఎక్కాలు దేవ్ భాస్కర్, చెక్కిళ్ల అంజమ్మ, జూకంటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ వగ్గు మల్లన్న కు ఘనంగా

# నివాళులర్పించిన సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ శ్రేణులు...

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సీనియర్ నాయకుడు కామ్రేడ్ వగ్గు మల్లయ్య యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో గుండె పోటు తో అకాల మరణం చెందాడు. కామ్రేడ్ మల్లయ్య మరణ వార్త విన్న సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) శ్రేణులు, నాయకులు, ధర్మారెడ్డి గూడెం సర్పంచ్, కాచారం సర్పంచ్, మాజీ సర్పంచ్ లు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బంధువులు, అభిమానులు కామ్రేడ్ మల్లయ్య పార్థివ దేహంపై ఎర్ర బట్ట కప్పి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. అంతిమ యాత్రకు ముందు కామ్రేడ్ మల్లన్న మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ సంతాప సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత రైతు.కూలీ సంఘం(ఏ ఐ కె ఎం ఎస్)రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ మాట్లాడుతూ కామ్రేడ్ వగ్గు మల్లన్న ఊహ తెలిసినప్పటి నుండి ప్రజల కోసం ఆలోచించాడని, ఇతరులకు ఏదైనా ఆపతి వచ్చిందని తెలిస్తే అండగా నిలబడి ధైర్యాన్నిచ్చేవాడని, అందరితో ప్రేమగా ఉంటూ ఎంతో ఆప్యాయతతో పలకరిస్తూ అందరివాడిగా జనంలో కలిసిపోయాడని కొనియాడారు.కామ్రేడ్ ఒగ్గు మల్లయ్య సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ పార్టీలో, ప్రజా ఉద్యమాలలో, రైతాంగ ఉద్యమాలలో క్రియాశీలక పాత్రను పోషించాడని అన్నారు. సిపిఐ ఎం.ఎల్ ముఖ్యంగా ప్రతిఘటన పోరాట సారధి కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, దేశంలో కొనసాగిన అనేక ప్రజా ఉద్యమాల ప్రభావంతో కామ్రేడ్ వగ్గు మల్లన్న విప్లవోద్యమంలోకి వచ్చాడని అన్నారు. ఆలేరు విప్లవోద్యమంలో కామ్రేడ్ బండ్రు నర్సింహులు, తో పాటు కామ్రేడ్ కటకం అంజన్న, పెద్దిరెడ్డి బుచ్చిరెడ్డి,పారెల్లి యాదగిరి, కట్టా నరసింహారెడ్డి తదితరుల నాయకత్వంలో సాగిన రైతాంగ ఉద్యమాలలో మరియు జీతగాళ్ళకు జీతాలు పెరగాలని, సౌకర్యాలు మెరుగుపడాలని, సమస్యలు పరిష్కరించాలని, రైతు కూలీలకు, వ్యవసాయ కూలీలకు జీవనోపాధి,రైతులకు గిట్టుబాటు ధర, కరెంటు సరఫరా, కరువు కాటకాలు తదితర అనేక ప్రజా ఉద్యమాలలో కామ్రేడ్ వగ్గు మల్లన్న ముందు వరుసలో ఉన్నాడని అన్నారు. నేడు కేంద్రంలో మతతత్వ బిజెపి పార్టీ దాని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక,రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు కొనసాగుతున్న ఈ కాలంలో, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ఈ సమయంలో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాల్సినటువంటి పరిస్థితులలో కామ్రేడ్ ఒగ్గు మల్లన్న భౌతికంగా దూరమవడం తన కుటుంబంకు, ప్రజా ఉద్యమాలకు, ఆలేరు ప్రాంత విప్లవోద్యమానికి తీవ్ర నష్టకరమని ఆ నష్టాన్ని పూడ్చడానికి సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ శ్రేణులు, రైతు కూలీ ఉద్యమ నాయకులు కార్యోన్ముఖులై ప్రజా, రైతాంగ ఉద్యమంలో కొనసాగాలని అన్నారు. కామ్రేడ్ ఒగ్గు మల్లన్న ఆశయం అయినట్టు నూతన ప్రజాస్వామిక విప్లవం ను పరిపూర్తి చేయడానికి మరింత పట్టుదలతో ముందుకు సాగాలని ప్రజలకు,పార్టీ శ్రేణులకు, రైతు కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్. జనార్ధన్,డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, సిపిఐ ఎంఎల్ జనశక్తి నాయకులు ఇప్ప రామకృష్ణయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు మామిడాల సోమయ్య, జిల్లా అధ్యక్షులు కళ్లెపు అడివయ్య, ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్ సీత, సుంకే సుగుణమ్మ,



ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పద్మ సుదర్శన్,గడ్డం నాగరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు బర్మా బాబు, అండ్ రెడ్డి బాల్రెడ్డి, చిర బోయిన కొమురయ్య, మామిడాల బాల మల్లేష్,గడ్డం మంకయ్య, తమ్మడి అంజయ్య, ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు కొంగరి సాయిరాం ఎర్ర మల్లేష్, ఉచ్చంతల మల్లేష్, ఇంజ శ్రీనివాస్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శికిలం కుమారస్వామి, ఎలగందుల సిద్ధులు, జిల్లా నాయకులు ఇక్కిరి శ్రీనివాస్, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడాల ప్రవీణ్, ఆర్.ఉదయ్, ప్రజా సంఘాల నాయకులు గోధుమ కొమురయ్య, తమ్ముడి రమేష్, దార యాదగిరి, కుర్రి మార్కండేయ, పాకాల నరేష్, మేకల వెంకటేష్, మాజీ ఎంపీపీ దడిగ ఇస్తారి, కాచారం సర్పంచ్ కొండం ఉపేందర్, రెడ్డి ధర్మారెడ్డి గూడెం సర్పంచ్ కొల్లూరి రాజయ్య, మాజీ ఎంపిటిసి సుగుణ ఎడ్ల రామ్ రెడ్డి, సర్పంచులు కట్టా సమరసింహారెడ్డి, కొండం అరుణ అశోక్ రెడ్డి, మాజీ స్వర్గం నరహరి, ఎంపిటిసి నమిలే అరుణ ఆంజనేయులు, సిపిఎం పార్టీ నాయకులు నాలపట్ల శంకర్, ఇతర రాజకీయ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు లెక్కలు... రైతులకు తిప్పలు....

**విధులకు సరిగా హాజరుకాని ఏవో పై డీఈవో ముందే ఆగ్రహం.....**
**సస్పెండ్ చేయాలంటూ రైతన్నల డిమాండ్....**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల వ్యవసాయ అధికారి పద్మజ తీరుపై మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుణ్యాల వెంకటరమణారెడ్డి ముందు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజపేట రైతువేదికలో గూగుల్ మీట్ లో పాల్గొనేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాగా హాజరైన రైతులతోపాటు, మరికొందరు రైతులు వచ్చి ఏవో పై ఫిర్యాదు చేశారు. విధులకు సరిగా హాజరుకాకుండా రైతులకు అందుబాటులో లేకుండా ఇష్టం వచ్చినట్లుగా ఏవో వ్యవహరిస్తున్నట్లు తెలుపుచూ, పంటల నమోదులో ఇష్టం వచ్చినట్లుగా నమోదు చేసి అనేకమంది రైతులకు అన్యాయం జరిగేట్లుగా ఏవో పద్మజ వ్యవహరించినట్లు ఆరోపించారు. వరి సేద్యం చేసిన రైతులు పత్తి పంట వేసినట్లు నమోదు చేయడంతో ఐకెపి కేంద్రాల వద్ద ధాన్యం విక్రయము ఇబ్బందికరంగా మారిందని రైతులు అన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించని రైతులకు అన్యాయం జరిగే విధంగా ప్రవర్తిస్తున్న ఏవో పై వెంటనే చర్యలు తీసుకోవాలని సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో కలెక్టర్



కార్యాలయం వద్ద ఆందోళన చేయనున్నట్లు రైతులు హెచ్చరించారు. గూగుల్ మీట్ సమయంలో అరగంటకు పైగా ఏవో పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ముందు రైతులు తమ బాధను వెళ్ళగక్కారు. గూగుల్, మీట్ లో పాల్గొనే రైతులకు కనీసం కుర్చీల ఏర్పాటు చేయకపోవడం, ఉదయం జిల్లా అధికారి రైతు వేదిక కు వచ్చిన సమయంలో వ్యవసాయ శాఖ అధికారిని పద్మజ లేకపోవడంతో పాటు కనీసం తాళం కూడా తీయకపోవడం పట్ల డిఏఓ ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

# స్వీయ గణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** జన గణన ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, స్వీయ నమోదు చేసుకుని, డిజిటల్ స్వీయ గణన విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆన్లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా ప్రజలు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జన గణన ప్రక్రియలో భాగంగా స్వీయ నమోదు చేసుకున్నారు. అందుబాటులో ఉన్న ఆన్ లైన్ వెబ్ సైట్ https://se.census.gov.in ద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం డిజిటల్ స్వీయ గణన విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆయన పేర్కొన్నారు.మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆన్లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించబడిందని వివరించారు. స్వీయ గణన ఈ నెల 26 నుండి ప్రారంభమైందని, మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ ప్రక్రియను సుమారు 15 నిమిషాల్లో పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.వివరాలు నమోదు చేసుకున్న తర్వాత ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి జారీ చేయబడుతుందని,




క్షేత్రస్థాయిలో ఇంటికి వచ్చే ఫీల్డ్ ఎన్యుమరేటర్లకు ఈ ఐడి నెంబర్ ను తెలియజేయాలని సూచించారు. ఆన్లైన్ లో నమోదు చేసిన సమాచారాన్ని ఎన్యూమరేటర్లు ధృవీకరిస్తారని, దీనివల్ల ప్రయాణాల్లో ఉన్నవారు, వలస కార్మికులు కూడా సులభంగా పాల్గొనే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.స్వీయ గణనలో ఖచ్చితమైన చిరునామా, సరైన వివరాలు నమోదు చేయాలని, వీటి ఆధారంగానే ఎన్యూమరేటర్ల నియామకం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించి ప్రతి పౌరుడి వివరాలు జన గణనలో చేరేలా చూడడమే లక్ష్యంగా ఈ ప్రక్రియను ప్రవేశపెట్టారని, జిల్లా ప్రజలందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా కల్పించారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా

# షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు..




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఆదేశానుసారం ఈ రోజు మంగళవారం నాడు సంగారెడ్డి జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో రంజోల్ పాలిటెక్నిక్ కాలేజ్, మాచ్నూర్ కేంద్రీయ విద్యాలయం, కాశీపూర్ మైనారిటీ గురుకుల పాఠశాలలో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలు అనే అంశాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా షీ టీం ఎస్ఐ పూలభాయ్ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, షీ టీమ్ బృందాలు నిరంతరం



వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా పితృస్వామ్య వ్యవస్థ, లింగ వివక్ష, పని ప్రదేశంలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేదింపులు, సైబర్ నేరాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించవలసిన నంబర్లు 100, 112, 1930, 1098 మరియు సంగారెడ్డి షీ టీమ్ నంబర్ 8712656772 గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్ఐ పూలభాయ్, సిబ్బంది కలిసి మహిళల భద్రత, బాలల రక్షణపై ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు.

## షాట్‌పుట్‌లో జాతీయ స్థాయి

# విజయం సాధించిన రావిగూడెం యువకుడు శ్రీకాంత్

**అభినందించిన ఎమ్మెల్యే రామచంద్ర నాయక్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రావిగూడెం గ్రామానికి చెందిన చిర్ర శ్రీకాంత్ క్రీడారంగంలో మరో మైలురాయి సాధించాడు. షాట్‌పుట్ అథ్లెటిక్స్‌లో అతను జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచి అందరిదృష్టిని ఆకర్షించాడు. ముఖ్యంగా గత సంవత్సరం లో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ షాట్ పుట్ పోటీల్లో పాల్గొని మొదటి స్థానం దక్కించుకోవడం ద్వారా తన ప్రతిభను ప్రపంచ వేదికపై చాటిచెప్పాడు. గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగిన యువ క్రీడాకారుడు ఈ స్థాయికి చేరుకోవడం విశేషంగా నిలిచింది. మరిపెడ మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వం విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్‌ను శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అతనికి అభినందనలు తెలియజేస్తూ, అతని కృషి, పట్టుదల, లక్ష్యసాధనకు ఉన్న నిబద్ధతను కొనియాడారు. క్రీడారంగంలో ఉన్నత స్థాయికి చేరాలంటే నిరంతర సాధనతో పాటు ఆత్మవిశ్వాసం అవసరమని, ఆ లక్షణాలన్నీ శ్రీకాంత్‌లో కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. శ్రీకాంత్ ఇప్పటివరకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కూడా తన ప్రతిభను నిరూపించుకోవడం గర్వకారణమని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో ఇంకా పెద్ద స్థాయిలో పోటీలు ఆడి దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ యువతకు అతను ఒక ప్రేరణగా నిలుస్తున్నాడని అన్నారు. శ్రీకాంత్ విజయానికి అతని కుటుంబం, ముఖ్యంగా తండ్రి చిర్ర వెంకన్న అందించిన ప్రోత్సాహం ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి చూపిన కుమారుడిని ప్రోత్సహించి, సరైన దారిలో నడిపించడం వల్లే ఈ స్థాయికి ఎదిగాడని తెలిపారు. తల్లిదండ్రుల మద్దతు ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచే అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అన్నారు. ఇకపై శ్రీకాంత్ ప్రతిభను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అతనికి అవసరమైన సహాయ సహకారాలు, శిక్షణ, సౌకర్యాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్ర క్రీడారంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంలో స్థానిక నాయకులు, క్రీడాభిమానులు, గ్రామస్థులు శ్రీకాంత్‌ను అభినందిస్తూ అతని భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. రావిగూడెం గ్రామానికి చెందిన ఈ యువ క్రీడాకారుడు జిల్లా, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాడని అందరూ అభిప్రాయపడ్డారు.



# మధుసూదన్ భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మిర్యాలగూడలోని మధుసూదన్ నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించిన రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మధుసూదన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకతప్త హృదయంతో ఉన్న వారి కుటుంబ సభ్యులకు మంత్రి అండగా ఉంటానని భరోసా ఇచ్చి తక్షణ ఆర్థికసాయం కింద ఐదు లక్షల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో సీనియర్ జర్నలిస్టుగా దశాబ్ద కాలం పాటు సేవలందించిన మధుసూదన్ నాకు ఎంతో సన్నిహితుడు ఇటీవల డిప్యూటీ సీఎం వద్ద జరిగిన ఆర్ అండ్ బి శాఖ రివ్యూలో రోడ్ నెట్వర్క్ ప్రెస్ నోట్ విషయంలో ఆయనతో సుదీర్ఘంగా చర్చించాను. ఆ జ్ఞాపకాలు ఇంకా కళ్లముందే కదలాడుతున్నాయి. చిన్న వయసులోనే మధు హఠాన్మరణం చెందడం తీరని లోటని, వారి కుటుంబానికి ఈ కష్ట సమయంలో అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి, తుర్కపల్లి మండలం, దయ్యంబండ తండా గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ మరియు దుర్గమ్మ తల్లి పండుగ వేడుకలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోటకొండూరు మండలం, వర్టూరు గ్రామానికి చెందిన తిరుపతి గౌడ్ కుమారుడి వివాహ విందు వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మోటకొండూరు మండలం, ఇక్కుర్తి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ చామకూర శ్రీనివాస్ రెడ్డి మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు

## నూతన అదనపు కలెక్టర్

# బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలో నూతన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మట్ బాధ్యతలు స్వీకరించారు. ప్రమోషన్‌పై జిల్లాకు వచ్చిన కలెక్టర్ హరితను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు. జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్‌కుమార్, సంక్షేమ అధికారి భాస్కర్, పరిపాలన అధికారి కిరణ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

## బ్రహ్మోత్సవాలు ఎంపీ ఈటెల రాజేందర్ కు ఆహ్వానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, సిద్దిపేట జిల్లా:**
వర్గల్ మండల కేంద్రంలోని పురాతన శ్రీ వేణుగోపాల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29వ తేదీ బుధవారం ఆరంభం కానుండగా, మంగళవారం ఎంపీ ఈటల రాజేందర్ కు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు, కమిటీ సభ్యులు టేకులపల్లి రాశీరెడ్డి, టేకులపల్లి బాల్ రెడ్డి తదితరులు ఉన్నారు

## వేసవిలో త్రాగునీటి సమస్యలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్, పంచాయతీ, మిషన్ భగీరథ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. చేతిపంపులు, బోర్లు, పైప్‌లైన్ మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని, మిషన్ భగీరథ నీరు అందని గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి లాగ్‌బుక్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. చేతిపంపులు ఎండిపోతే వ్యవసాయ బావులు గుర్తించి యజమానులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కార్మికులకు త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వీధి దీపాలు పగలు వెలగకుండా స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ, జనాభా గణన స్వీయగణనపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు

## రైతులకు భూముల పట్టాలపై జిల్లా పాలనాధికారి కి వినతి.....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రాయి సెంటర్ రాజ్ గోండ్ సేవా సమితి ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ కె. హరితకు వినతిపత్రం అందజేశారు.డీప్ ఫారెస్ట్‌లోని ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు కేటాయించకుండా అర్హులైన రైతులకు పట్టాలు ఇవ్వాలని, సిర్పూర్–టి రైల్వే స్టేషన్ నుండి కాలనీ వరకు బస్సు నడిపించాలని కోరారు.రైతులకు భూముల కేటాయింపు విషయమై ప్రభుత్వానికి నివేదించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరిత హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధి పార్చకి కేశరావు, జిల్లా ప్రతినిధి కుర్సింగ మోతీరం తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో షీ టీమ్ అవగాహన కార్యక్రమం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ షీ టీమ్ వసుంధర డిగ్రీ కాలేజ్, బస్టాండ్, ఆటో స్టాండ్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. షీ టీమ్ ఇన్‌చార్జ్ ఏఎస్ఐ డి. సునీత మహిళలు, విద్యార్థులు, చిన్నపిల్లల భద్రతపై అవగాహన కల్పించింది. మహిళల భద్రత, శిశు రక్షణ, లింగ సమానత్వం, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై వివరించింది. అత్యవసర సమయాల్లో డయల్ 112 వినియోగించుకోవాలని సూచించింది. కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి : డిఏఓ పుణ్యాల వెంకటరమణారెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** జిల్లాలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేనిపక్షంలో ప్రభుత్వాలు అందించే సదుపాయాలకు అనర్హులు అవుతారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుణ్యాల వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రాజపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 2, 71, 794 మంది రైతుల అలాట్మెంట్ ఉండగా ఇప్పటివరకు 1,75,165 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్నట్లు మిగిలిన 96,629 మంది పెండింగ్ లో ఉన్నట్టు వివరిస్తూ 64.45% రిజిస్ట్రేషన్ అయినట్లు డిఏఓ వివరించారు. మే నెల 31 వరకు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మిగిలిన రైతులను కోరారు. ఫార్మర్ రిజిస్ట్రీ రైతులకు ఆధార్ కార్డు వంటిదని అన్నారు.లివచ్చే వానకాలం సన్నాలు పండించాలిలి వచ్చే వానకాలం రైతులు సన్నధాన్యం పండించే విధంగా కృషి చేయాలని డీఏవో కోరారు. దొడ్డు బియ్యం కు డిమాండ్ లేదని సన్న బియ్యం కు డిమాండ్ ఉన్న కారణంగా రైతులు ఎక్కువ గిట్టుబాటు ధరతో లాభాలు పొందుతారని వివరించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రస్తుతం 358 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 4.5 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి కానున్నట్లు తెలిపారు. గత ఏడాది 2.87 లక్షల ధాన్యం దిగుబడి అయినట్లు ఈసారి 38 రైస్ మిల్ లను ధాన్యం కొనుగోలుకు గుర్తించినట్లు వివరించారు. కాండం తొలుచు పురుగు ఆశించడం వల్ల ఈసారి కొంత దిగుబడి తగ్గనుందని ఆయన అన్నారు. ఎక్కువ ధాన్యం దిగుబడి వలిగొండ, రామన్నపేట, పోచంపల్లి మండలాల్లో రానున్నట్లు చెప్పారు. మీడియా సమావేశంలో రాజపేట మండల వ్యవసాయ అధికారిని పద్మజ ఏఈఓ లు ఉన్నారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు

# చేనేతల వ్యూహాత్మక సమావేశం

**హ్యాండ్లూమ్ పాలసీ/విధానపత్ర రూపకల్పనకు నిర్ణయం**

**తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల పర్యటనకు అధ్యయన కమిటీ**

**కేంద్ర ప్రభుత్వానికి గ్రౌండ్ రిపోర్ట్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** చేనేతల హక్కుల సాధనకై వివిధ రూపాలలో వివిధ సంఘాలు మరియు వేదికల ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలు, ప్రభుత్వంలో వస్తున్న కదలికలు మరియు భవిష్యత్తు కార్యచరణ పై వ్యూహరచన సమావేశం జరిగింది. సుదీర్ఘ చర్చ, లోతైన అధ్యయనం, సమాలోచనల తర్వాత చేనేత అధ్యయన కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మరియు తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో క్షేత్రస్థాయి అధ్యయనం, ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయిలో విధాన పత్రాన్ని రూపొందించాలని నిర్ణయించడం జరిగింది. ఈ నివేదిక భవిష్యత్తులో ప్రభుత్వాలకు ఒక దిక్సూచిగా ఉండాలని సమావేశం అభిప్రాయపడింది. ఇప్పటివరకు రాజకీయ పార్టీలు చేనేతలను ఎన్నికల ఓటు బ్యాంకు కేంద్రకంగా రూపకల్పన చేసే పథకాలు మరియు బడ్జెట్ కేటాయింపులు శాశ్వత పరిష్కారాన్ని చూపెట్టలేకపోయాయి. హ్యాండ్లూమ్ పాలసీ లేకపోవడం వల్ల ప్రభుత్వాలు మారినప్పుడల్లా చేనేత కళాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని చేనేత అధ్యయన కమిటీ మరియు న్యాయపరంగా మన హక్కుల సాధన కొరకు లీగల్ కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానించడం జరిగింది. ఇప్పటివరకు చేనేత కళాకారుల సంక్షేమం చేనేత రంగ అభివృద్ధి కోసం పనిచేస్తున్న చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని సంఘాలను ఉద్యమంలో భాగస్వామ్యం చేసి అన్ని జిల్లా కేంద్రాలలో సమావేశాలు నిర్వహించాలని, త్వరలోనే ముఖ్య నేతలను ఆహ్వానించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించడమయినది. వ్యూహాత్మక సమావేశంలో



ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ టి. చిరంజీవులు, చేనేత దినోత్సవ వ్యవస్థాపకులు యర్రమాద వెంకన్న నేత పాల్గొనగా ఈ సమావేశంలో పాల్గొనడానికి బయలుదేరి అనివార్య కార్యక్రమాల వల్ల హాజరుకాలేకపోయిన మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరావత్రి అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఫోన్లో మాట్లాడారు

# రోగులకు మెరుగైన సేవలే లక్ష్యం....

**తుర్కపల్లి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, నారాయణఖేడ్ :**
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు తనిఖీ చేయడంతో పాటు ప్రయోగశాల, ఔషధ నిల్వ విభాగం, ఇతర సేవా విభాగాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడి వారికి క్రమంతప్పకుండా పరీక్షలు జరుగుతున్నాయా, అవసరమైన మందులు అందుతున్నాయా అనే విషయాలను ఆరా తీశారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలనీ, ఆసుపత్రిలో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు సహా అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి వివరించారు. ప్రతిరోజు లోపలి రోగులు, బాహ్య రోగుల సంఖ్య, గర్భిణీల పరీక్షలు, అందుబాటులో ఉన్న వైద్య పరీక్షలు, ప్రతి నెల జరిగే ప్రసవాల సంఖ్య వంటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని, ముఖ్యంగా





సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ తనిఖీలో ఉప కలెక్టర్ ఉమా హారతి, మండల అభివృద్ధి అధికారి, వైద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

# భారత్ లో డిజిటల్ అరెస్ట్ స్కామ్ 9 వేల 400 ఖాతాలను బాక్ల్ చేసిన వాట్సప్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, న్యూఢిల్లీ:**
మెటా యాజమాన్యంలోని ప్రముఖ మెసేజింగ్ ఫ్లాట్?ఫామ్ వాట్సాప్ ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్షన్ సెక్యూరిటీ ఫీచర్?ను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ ఫీచర్?ను అడ్డుపెట్టుకుని డిజిటల్ అరెస్ట్ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. దీంతో వాట్సాప్ ద్వారా డిజిటల్ అరెస్ట్ స్కాములకు పాల్పడుతోన్న అకౌంట్లపై మెటా ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగానే 2026 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు భారతదేశంలో డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లకు సంబంధించిన 9,400కు పైగా ఖాతాలను నిషేధించినట్లు వాట్సాప్ సుప్రీంకోర్టుకు తెలిపింది. దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న డిజిటల్ అరెస్ట్ స్కామ్ అంశాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకుని విచారిస్తోంది. విచారణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తరుఫున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి సుప్రీంకోర్టుకు కీలకమైన నివేదికలు సమర్పించారు. ఈ నివేదికల ప్రకారం.. 2026 ప్రారంభం నుంచి ఇప్పటి వరకు భారతదేశంలో డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లకు సంబంధించిన 9,400కు పైగా ఖాతాలను నిషేధించినట్లు వాట్సాప్ తెలిపింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, టెలికమ్యూనికేషన్స్ విభాగం నుంచి అందిన సమాచారం మేరకే తాము ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. భారతీయ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని డిజిటల్ అరెస్ట్ మోసాలకు పాల్పడుతోన్న చాలా ఖాతాలు ఆగ్నేయాసియాలోని ముఖ్యంగా కంబోడియా నుంచి నిర్వహించబడుతున్నాయని వెల్లడించింది. ప్రజలను




భయపెట్టేందుకు సైబర్ నేరగాళ్లు ఢిల్లీ పోలీస్, ముంబై హెచ్‌క్యూ, సీబీఐ, ఏటీఎస్ డిపార్ట్‌మెంట్ వంటి పేర్లను ఉపయోగిస్తూ ప్రొఫైల్ చిత్రాలు పెడుతున్నారని తెలిపింది. ప్రభుత్వ సూచనల మేరకు రోజురోజుకు పెరిగిపోతున్న డిజిటల్ అరెస్ట్ స్కామ్?లను కట్టడి చేసేందుకు కొత్త సెక్యూరిటీ వ్యవస్థను తీసుకొచ్చినట్లు వాట్సాప్ వెల్లడించింది.



## వివాహ కార్యక్రమాలలో పాల్గొన్న టి.ఎస్.టి.డబ్ల్యూ.టి.యు జిల్లా కార్యవర్గం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, ఆదిలాబాద్ జిల్లా:**
ఆదిలాబాద్ జిల్లా తెలంగాణా రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం (టి ఎస్ టి డబ్ల్యూ టి యు) జిల్లా కార్యవర్గం మంగళవారం రెండు వివాహ కార్యక్రమాలలో పాల్గొంది. ఇంద్రవెల్లి సాకేర గ్రామంలో సి ఆర్ టి రాథోడ్ హిరామన్ కుమారుని వివాహ విందుకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆదిలాబాద్ నగరంలోని తనీషా గార్డెన్‌లో జరిగిన జాదవ్ సంగీత-రమేష్ దంపతుల పుత్రిక రాజేశ్వరి--అశ్విన్ కుమార్ వివాహానికి జిల్లా ఉపాధ్యక్షులు పూర్కా ఉద్ధవ్, నైతం కృష్ణారావ్, జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్, ప్రధాన కార్యదర్శి మాడావి గోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కూడ్మేత అనంత్, కోర్వేత మనోహర్, చాహకటి శ్యామ్‌రావ్, హన్మంత్‌రావ్, కుమరం మాధవరావ్, నైతం నారాయణ, పెందూర్ విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం... ముగ్గురిపై కేసు నమోదు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరంభీమ్ ఆసిఫాబాద్: రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన 175 కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.4,37,500. వ్యవసాయ శాఖ అధికారి డి. దిలీప్‌కుమార్ ఫిర్యాదు మేరకు రెబ్బెన సి ఐ సంజయ్ నేతృత్వంలో పోలీసులు చర్యలు చేపట్టారు. కొమురవెల్లికి చెందిన గజ్జెల సూర్యకాంత్, జక్కులపల్లికి చెందిన ధోని రాజేష్, కొమురవెల్లికి చెందిన కొల్లూరి సాయికిరణ్ ముగ్గురు కలిసి ఆంధ్రప్రదేశ్ నుండి నిషేధిత విత్తనాలు తెచ్చి అధిక దిగుబడి వస్తుందని రైతులను మోసం చేస్తూ విక్రయిస్తున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతారని సి ఐ తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## యాసంగి ధాన్యం కొనుగోళ్లకు 33 కేంద్రాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఎం. డెవిడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, సహకార, పౌర సరఫరాల, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సెర్ఫ్ ఆధ్వర్యంలో 14, సహకార శాఖ ఆధ్వర్యంలో 19 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర నిర్ణయించారు. సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ప్రకటించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గన్నీబ్యాగులు అందుబాటులో ఉంచాలని, ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోళ్లు పూర్తిగా ఓపీఎంఎస్ విధానంలో జరుగుతాయని తెలిపారు.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్‌లో జిల్లా విద్యార్థినులకు కాంస్య పతకం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు భువనగిరి జిల్లా మొతుకుర్‌లో ఈ నెల 25 నుండి 27 వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలో కాంస్య పతకం సాధించారు. విద్యార్థినులను మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ కె. హరిత అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పతకాలు సాధించడంలో కృషి చేసిన డి వై ఎస్ ఓ అష్ఫక్ హైమద్, పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ మల్లీశ్వరి సేవలు అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ రాష్ట్ర ప్రతినిధులు సైనీ రవికుమార్, సోమశేఖర్, డిఎస్ఓ షేక్, కోచ్ రవి, ఖేలో ఇండియా కోచ్ కడతల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాత గూడలో పెద్ద దేవుల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం మంగీ గ్రామపంచాయతీ పరిధిలోని పాత గూడ గ్రామంలో రాయి సీడం వంశీయుల పెద్ద దేవుల ఉత్సవాలు ఈ నెల 29న వైభవంగా జరగనున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. గిరిజన సంప్రదాయం ప్రకారం నిర్వహించే ఈ ఉత్సవాల్లో రాయి సీడం వంశీయుల ఆచారాలకు ప్రాధాన్యత ఉంటుంది. పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పెద్ద దేవుల ఆశీస్సులు తీసుకోవాలని సర్పంచ్ రాయి సీడం వినోద్ కోరారు.

## పెంచికల్‌పేట్ ఎస్సైపై సర్పంచ్ ఫిర్యాదు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
దరోగపల్లి సర్పంచ్ బొట్టుపెల్లి కృష్ణవేణి పెంచికల్‌పేట్ ఎస్సైపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సమ్మక్క సారక్క జాతరకు వెళు_న్న సర్పంచ్ దంపతులను పాలె సుధాకర్ అనే వ్యక్తి మార్గంలో అడ్డుకొని బైక్ లాక్కొని దురుసుగా ప్రవర్తించాడు. పెంచికల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసును తప్పుదోవ పట్టించాడు. ఎస్పీకి ఫోన్ చేసినట్లు తెలుసుకున్న తర్వాత నుండి ఎస్సై గ్రామానికి వచ్చిన ప్రతిసారి సర్పంచ్‌పై వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశాడు. ఏప్రిల్ 25న పంచాయతీ సెక్రటరీపై ఒక వ్యక్తి లంచం ఆరోపణ చేయడంతో సర్పంచ్, భర్త, సెక్రటరీ కలిసి ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళగా ఎస్సై మహిళా సర్పంచ్‌ను అవమానకరంగా వెళ్ళిపొమ్మని దురుసుగా మాట్లాడాడు. ఎస్సైపై చర్య తీసుకోవాలని కోరగా జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించారు.

## చమురు కూటమికి యూఏఈ గుడ్ బై..! అంతర్జాతీయంగా ప్రకంపనలు..!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28 :**
అంతర్జాతీయ ఇంధన రంగంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ది పెట్రోలియం ఎక్స్పోర్టింగ్ కంట్రీస్, విస్తృత ఓపిఈసిం కూటమి నుండి లాంఛనంగా వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. మే 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని ప్రకటించింది. దీంతో దాదాపు ఆరు దశాబ్దాల సభ్యత్వానికి యూఏఈ ముగింపు పలికినట్లయింది. ఇది ప్రపంచ చమురు ధరలను నియంత్రించే ఒపెక్ సామర్థ్యంపై ప్రభావం చూపనుంది. రాష్ట్ర వార్తా సంస్థ డబ్ల్యూఎమ్ ద్వారా, యూఏఈ ఇంధన మంత్రిత్వ శాఖ, తమ ఉత్పత్తి విధానంపై "సమగ్ర సమీక్ష" తర్వాత ఈ నిర్ణయం ప్రకటించింది. 2027 నాటికి రోజుకు 5 మిలియన్ బారెల్స్ ఉత్పత్తి చేయాలనే అబుదాబి ఉత్పత్తి లక్ష్యాలను, ఓ.పి.ఈ.సి ం కూటమి విధించిన కఠినమైన కోటాలు అడ్డుకుంటున్నాయని యూఏఈ ఆరోపించింది. ఒపెక్ కూటమి నుంచి వైదొలగడం ద్వారా, యూఏఈ సొంత చమురు ఉత్పత్తి స్థాయిలను నిర్ణయించుకునే సార్వభౌమాధికారాన్ని తిరిగి పొందుతుంది. జాతీయ ప్రయోజనం, ప్రపంచ మార్కెట్ అవసరాలను సమర్థవంతంగా తీర్చడమే ఈ నిర్ణయానికి కారణం. నిల్వలను దూకుడుగా వినియోగించుకుని, ఆర్థిక వ్యవస్థను వైవిధ్యపరచడానికి నిధులు సమకూర్చడమే యూఏఈ లక్ష్యం. ప్రాంతీయ అస్థిరత, ఇరాన్‌తో కొనసాగుతున్న వివాదం ఇంధన మార్కెట్‌లను కలచివేస్తున్న తరుణంలో యూఏఈ నిష్క్రమణ కీలకంగా మారింది. ఓపెక్ బాస్ సౌదీ అరేబియాతో యూఏఈకి పెరుగుతున్న ఘర్షణే ఈ నిర్ణయం వెనుక కారణంగా తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధిలో సముద్ర రవాణాపై దాడుల వంటి బెదిరింపులకు ఇతర అరబ్ దేశాల నుండి తగిన రక్షణ లేదని యూఏఈ భావన. యూఏఈ నిర్ణయం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు దౌత్యపరమైన విజయంగా భావిస్తున్నారు. ట్రంప్ ఒపెక్ ను అంతర్జాతీయ చమురు ధరలను పెంచుతుందని తరచుగా విమర్శిస్తూ వస్తున్నారు. యూఏఈ ఈ చర్య ద్వారా పశ్చిమ దేశాల్లోని తన ప్రధాన భద్రతా మిత్రులతో ఇంధన విధానాన్ని సమలేఖనం చేసుకుంటుంది; రియాద్, మాస్కో మద్దతు ఇచ్చే నియంత్రిత స్థిరత్వం కంటే, మార్కెట్ ఆధారిత ధరలకే ప్రాధాన్యత ఇస్తుంది. గణనీయమైన అదనపు సామర్థ్యం గల ఒపెక్ సభ్యుల్లో యూఏఈ ఒకటి. దాని నిష్క్రమణ కూటమి సమిష్టి బేరసారాల శక్తిని బలహీనపరుస్తుంది. ఈ నష్టం డొమినో ప్రభావాన్ని లేదా ధరల యుద్ధాన్ని ప్రేరేపించవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మార్కెట్ వాటాను నిలబెట్టుకోవడానికి ఇతర సభ్యులు కోటాలు ఉల్లంఘించవచ్చని, అదే సమయంలో ఒపెక్ ప్లస్ కూటమి కొత్త సవాళ్లను ఎదుర్కోక తప్పేలా లేదు.

# భారత్ కు రష్యా బిగ్ గిఫ్ట్... పాకిస్థాన్ మొత్తం బూడిద అయ్యే ఆయుధం

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 28, సెంట్రల్ డెస్క్ :
భారత్ కు సరిహద్దు దేశాలైన పాకిస్థాన్, చైనాలతో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో భారత్ తన ఆయుధ సంపత్తిని మరింతగా పెంచుకుంటోంది. ఈ మేరకు భారత్ కు చిరకాల మిత్రుడైన రష్యా నుంచి అత్యాధునిక ఎ 400 గగనతల వ్యవస్థలు భారత్ కు చేరేందుకు రెడీగా ఉన్నాయి. మే నెలాఖరు నాటికి భారత్ కు నాలుగో యూనిట్ రానున్నట్లు స్పష్టం అవుతోంది. ఇప్పటికే రష్యా నుంచి ఇందుకు సంబంధించిన నౌకలు బయల్దేరినట్లు తెలుస్తోంది. ఇక గతేడాది ఏప్రిల్ 22 న భారత్ లోని పహల్గామ్ లో పాకిస్థాన్ ఉగ్రమూకలు మారణకాండ జరిపిన విషయం తెలిసిందే. దానికి ప్రతీకారంగా పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. అయితే భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన ఈ యుద్ధంలో పాకిస్థాన్ నుంచి వచ్చిన వేలాది డ్రోన్, క్షిపణులను ఎస్ - 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సమర్థవంతంగా ఎదుర్కొని వాటిని గాల్లోనే ధ్వంసం చేసింది. దాంతో పాకిస్థాన్ పై భారత్ విజయఢంకా మోగించింది. అయితే ఎస్ - 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కు చెందిన నాలుగో యూనిట్ కూడా త్వరలోనే భారత్ కు రానుంది. దీంతో పాకిస్థాన్ కు ఇది పెద్ద షాక్ అని చెప్పొచ్చు. ఈ నాలుగో యూనిట్ ను రాజస్థాన్ లోని పాకిస్థాన్ బోర్డర్ వద్ద మోహరించనున్నట్లు సమాచారం. దాంతో పాకిస్థాన్ సరిహద్దులో భారత వైమానిక రక్షణ మరింత బలోపేతం కానుంది. మరోవైపు ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కు చెందిన ఐదో యూనిట్ ఈ ఏడాది నవంబర్ నాటికి భారత సైన్యంలో చేరనున్నట్లు స్పష్టం అవుతోంది. దీనిని చైనా సరిహద్దుల్లోని కీలక ప్రాంతాల్లో మోహరించనున్నట్లు సమాచారం. అంతేకాక మరో 5 ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను కూడా రష్యా నుంచి భారత్ ముమ్ముందు కొనుగోలు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఆమోదం లభించినట్లు స్పష్టం అవుతోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే భారత్ వద్ద ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల సంఖ్య 10 కు చేరనుంది. ఇది పాకిస్థాన్, చైనాకు బిగ్ షాక్ అని చెప్పొచ్చు. ఇవే కాకుండా రష్యానుంచి పాంట్ సిర్ అనే మరో అత్యాధునిక రక్షణ వ్యవస్థను కూడా భారత్ కొనుగోలు చేయనున్నట్లు సమాచారం. వీటిలో కొన్ని రష్యా నుంచి కొనుగోలు చేసి.. మరికొన్నింటిని టెక్నాలజీ ట్రాన్స్ ఫర్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా మనదేశంలోనే తయారు చేయనున్నారు.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.